ఈనాడు
నిజామాబాద్
శనివారం అక్టోబరు 19, 2024

ముఖ్యమంత్రిని కలిసిన నుడా ఛైర్మన్

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నుడా(నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా నియమితులైన కేశ వేణు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి కృషి చేసినందుకు సీఎంను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఉన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నుడా ఛైర్మన్ కేశ వేణు, చిత్రంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మానాల మోహన్‌రెడ్డి

పోలీసు అమరులకు నివాళులు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో అమరులైన పోలీసుల కుటుంబాలను సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ శుక్రవారం కలిసి మాట్లాడారు. అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి అందిన సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు, ఎస్‌బీ సీఐ సత్యప్రసాద్, నగర సీఐ శ్రీనివాస్ రాజ్, పోలీసు సంఘం అధ్యక్షుడు షకీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



అమరుడి కుటుంబ సభ్యులతో సీపీ, అదనపు డీసీపీ తదితరులు

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు వరద కాల్వ ద్వారా శుక్రవారం ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం నుంచి గోదావరి నదిలోకి రెండు వరద గేట్ల ద్వారా 6248 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 20,702 క్యూసెక్కుల వరద చేరుతోంది. పూర్తిస్థాయిలో 1091 అడుగుల వరకు నీటిని నిల్వ చేస్తున్నారు. కాకతీయ కాల్వ ద్వారా 5800, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200, లక్ష్మి కాల్వ ద్వారా 150, సరస్వతి కాల్వ ద్వారా 500, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది.

నిండుగా నిజాంసాగర్

నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి వరద తగ్గిపోవడంతో ప్రధాన వరద గేట్ల నుంచి నీటి విడుదలను నిలిపి వేసినట్లు జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి సాగర్‌లోకి 3000 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో నీటిపారుదల శాఖ గేట్ల నుంచి 500 క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. 1404.90 అడుగుల (17.658 టీఎంసీలు) నిల్వ ఉందన్నారు.

పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ బదిలీ

డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ కూడా..

న్యూస్‌టుడే, నిజామాబాద్ నేరవిభాగం

నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీకి డిప్యుటేషన్ చేస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సతీమణి, 7వ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని కూడా అక్కడికే బదిలీ అయ్యారు. హైదరాబాద్ డీజీపీ కార్యాలయం నుంచి తుది ఉత్తర్వులు వచ్చాక ఇద్దరు రిలీవ్ కానున్నారు. కల్మేశ్వర్ శింగెనవార్ 10 అక్టోబరు 2023లో నిజామాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించారు. సొంత శాఖ ఉద్యోగులు తప్పు చేసినా.. ముక్కుసూటిగా వ్యవహరిస్తూ విధుల్లో తనదైన ముద్ర వేశారు. ప్రమాదాల కట్టడి, కేసుల ఛేదన, నియమ నిబంధనల పాటింపు విషయంలో కచ్చితంగా వ్యవహరించారని పేరొందారు.



కల్మేశ్వర్ : రోహిణి

నేరాల కట్టడిలో తనదైన ముద్ర..

మైనర్లు వాహనాలు నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. శిరస్త్రాణం ధరించి వాహనాలు నడపాలని విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. నగరంలో నేరాలు తగ్గించేందుకు హోటళ్లు, దుకాణాలు రాత్రి 10 గంటల తర్వాత మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని కోర్టు ఎదుట హాజరుపర్చారు. ముఖ్యంగా జిల్లాలోని కొన్ని వీడీసీలు కుల బహిష్కరణలు, సొంత నిర్ణయాలు, తీర్పులు చేయకుండా అరికట్టారు. గంజాయి, బెల్టు షాపుల నివారణకు చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పక్కా ప్రణాళికతో పోలీసులను ముందుకు నడిపించారు.



తెవివికి వీసీ వచ్చారు..!

ఉపకులపతిగా ఆచార్య యాదగిరిరావు

న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్

తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఎట్టకేలకు ఉపకులపతి వస్తున్నారు. తెవివికి ఆచార్య టి.యాదగిరిరావును నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్‌ఛార్జి పాలనకు తెరపడింది. గతంలో వీసీగా పని చేసిన ఆచార్య రవీందర్ గుప్తా గతేడాది జూన్ 17న హైదరాబాద్‌లోని స్వగృహంలో వర్సిటీ పరిధిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి అనుమతి ఇచ్చేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడ్డారు. అప్పటి నుంచి ఐఏఎస్ అధికారులే వర్సిటీకి ఇన్‌ఛార్జి వీసీగా కొనసాగారు. 16 నెలలుగా ఇన్‌ఛార్జులతో వర్సిటీ అభివృద్ధిలో విధానపరమైన నిర్ణయాలు అమలుకాలేదు. రెగ్యులర్ వీసీ నియామకం కావడంతో ఇకపై వర్సిటీ పరిపాలన, అకడమిక్ వాతావరణం గాడిన పడుతుందని ఉద్యోగులు, విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీతో గతంలో అనుబంధం..

తెవివికి రెగ్యులర్ వీసీగా వస్తున్న ఆచార్య యాదగిరిరావు గతంలో ఇక్కడ సోషల్ సైన్సెస్ డీన్‌గా రెండున్నరేళ్లు పని చేశారు. ఆయన వివాహం సైతం నిజామాబాద్‌లోనే జరిగింది. జిల్లా, వర్సిటీతో అనుబంధం, పట్టు ఉన్న వ్యక్తి వీసీగా వస్తున్నారు. తెవివి ఆవిర్భావం నుంచి నలుగురు రెగ్యులర్ వీసీలు పని చేశారు. కాశీరాం 6, నవంబరు 2006 - 3, నవంబరు 2009, అక్బర్ అలీ ఖాన్ 15, జులై 2011 - 14, జులై 2014, సాంబయ్య 25, జులై 2016 - 24, జులై 2019 వరకు పని చేశారు. రవీందర్‌గుప్తా 22, మే 2021న వీసీగా బాధ్యతలు చేపట్టి 17, జులై 2023న ఏసీబీకి పట్టుబడ్డారు. యాదగిరిరావు ప్రస్తుతం వరంగల్ జిల్లాకు చెందిన ఆచార్య యాదగిరిరావు అయిదో రెగ్యులర్ వీసీగా నియమితులయ్యారు.

ఆయన ప్రస్థానం ఇలా...

యాదగిరిరావు స్వస్థలం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో తొలి ఉద్యోగి. కాకతీయ వర్సిటీలో 2004లో అధ్యాపకుడిగా చేరి.. ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ ఆచార్యులుగా కొనసాగుతున్నారు. యూజీసీ సమన్వయకర్తగా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా, బీవోఎస్‌గా పని చేశారు. 33 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఈయన మార్గనిర్దేశంలో 21 మంది పీహెచ్‌డీ, తొమ్మిది మంది ఎంఫిల్ పట్టా పొందారు. దిల్లీలో యూజీసీ మేజర్ ప్రాజెక్టు పూర్తి చేశారు. 2021లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్నారు. 17 అంతర్జాతీయ, 29 జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్సులకు హాజరయ్యారు.

పల్లె పోరుకు పక్కా ఏర్పాట్లు

జిల్లాకు చేరుతున్న ఎన్నికల సామగ్రి

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కీలకమైన బ్యాలెట్ పెట్టెలపై అధికారులు దృష్టి సారించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఇది వరకు ఎన్నికల్లో వినియోగించిన వాటిలో ఏమైనా లోపాలు ఉన్నాయా.. సరిగా ఉన్నాయా చూడాలని పేర్కొంది. అవసరమైతే చిన్నచిన్న మరమ్మతులు చేపట్టాలంది. సంబంధిత అధికారులు మరమ్మతులకు కావాల్సిన అంచనా బడ్జెట్‌ను ఉన్నతాధికారులకు నివేదించారు. బడ్జెట్ మంజూరు కాగానే.. మరమ్మతులు చేపట్టి సిద్ధం చేయనున్నారు.

మూడు దశల్లో..

జిల్లాలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ మూడు రెవెన్యూ డివిజన్లు ఉండగా.. పంచాయతీ ఎన్నికలు 2018లో నిర్వహించినట్లుగానే మూడు దశలో జరగనున్నాయి. 2018 ఎన్నికల్లో 4,932 వార్డులు ఉండగా.. ఈసారి వాటి సంఖ్య 5,022కు పెరిగింది. ప్రతి వార్డులో 650 మంది ఓటర్లు ఉంటారు. వార్డుకో బ్యాలెట్ పెట్టె అవసరం ఉంటుంది. జిల్లాలో మూడు వేల బ్యాలెట్ పెట్టెలు గోదాంలో భద్రపర్చారు. మొదటి విడత ఎన్నికల్లో వినియోగించిన వాటినే రెండు, మూడు విడతల్లో వినియోగిస్తారు. త్వరలోనే మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో ఎన్ని పనికి వస్తాయో తేలనుంది. అంతగా అవసరమైతే పక్క జిల్లా నుంచి తెప్పించనున్నారు.



గోదాంలో భద్రం..

పల్లె పోరుకు సంబంధించి ఎన్నికల సామగ్రి జిల్లాకు చేరుతోంది. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు వచ్చాయి. వివిధ రకాల ఫారాలు, ఇతర వస్తువులు వచ్చాయి. వాటిని జడ్పీ కార్యాలయం వెనుక ఉన్న గోదాంలో ఉంచారు. ప్రభుత్వం రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతుండడంతో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు తుది జాబితాను ప్రకటించిన విషయం విదితమే.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

రాష్ట్రంలో అప్పటి భారాస ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఒకే రిజర్వేషన్లు పదేళ్ల పాటు ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అదే చట్టాన్ని కొనసాగిస్తుందా.. కొత్తగా తీసుకొస్తుందా అనే ఉత్కంఠ వీడడంలేదు. మరోవైపు బీసీ కుల గణన చేసిన తర్వాతే రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ వినిపిస్తోంది. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని ఆసక్తి నెలకొంది.

మొత్తం పంచాయతీలు : 545	వార్డుల సంఖ్య: 5,022	పురుష ఓటర్లు: 3,87,017	మహిళా : 4,43,548	ట్రాన్స్‌జెండర్లు: 15	మొత్తం ఓటర్లు: 8,30,580



వీసీలో పాల్గొన్న పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ, అదనపు కలెక్టర్, తదితరులు

గ్రూప్స్ పరీక్షలకు 72 కేంద్రాలు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ద్వారా నవంబరు 17, 18 తేదీల్లో గ్రూప్-2, డిసెంబరు 15, 16 తేదీల్లో గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీసీలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో 72 పరీక్ష కేంద్రాలు గుర్తించామని.. ఆర్డీవోలు వాటిని పరిశీలించి అన్ని వసతులు ఉండేలా చూస్తున్నారన్నారు. కలెక్టరేట్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రెండు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 22 లోపు స్ట్రాంగ్ రూంలు, పరీక్ష కేంద్రాల వివరాలు పంపిస్తామన్నారు. సమావేశంలో సీపీ కల్మేశ్వర్, అదనపు పాలనాధికారి కిరణ్‌కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్తలు రామ్మోహన్‌రావు, సాయిరెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ ఉన్నారు.

ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

నిజామాబాద్ కలెక్టరేట్: మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ) దోహదపడతాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పేర్కొన్నారు. ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీసీ కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంపిక చేసిన ఏటీసీ కేంద్రాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలి విడతలో నిజామాబాద్, కమ్మర్‌పల్లి, బోధన్‌లో కేంద్రాలు మంజూరు చేసిందని.. త్వరలోనే పలు కోర్సుల్లో శిక్షణ ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ ఆఖరుగా ఉందన్నారు. కార్మిక శాఖ అధికారి యోహన్, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, ఐటీఐ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సౌర వెలుగులకు సహకారం

వ్యక్తిగత యూనిట్ల ఏర్పాటుకు పెరిగిన సబ్సిడీ

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

విద్యుత్తు ఛార్జీల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు స్త్రీ నిధి కింద రుణ సదుపాయాన్ని కల్పించి వ్యక్తిగత సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేయిస్తున్నారు.

300 మంజూరు..

జిల్లాలోని భీమ్‌గల్, బోధన్, నవీపేట, మెండోరా తదితర మండలాల్లో గతేడాది 22 సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటు చేశారు. ఒక ఇంట్లో రూ.1,500 నుంచి రూ.1,600 వరకు విద్యుత్తు ఆదా కాగా.. ఏడాది మొత్తం కలిపి రూ.5.36 లక్షల బిల్లు ఆదా అయింది. ఈ ఏడాది 300 యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ.1.90 లక్షల ఖర్చవుతుంది. స్త్రీనిధి ద్వారా రుణం మంజూరు చేస్తారు. ఇదివరకు సబ్సిడీ రూ.53 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.78 వేలకు పెంచింది. యూనిట్ల కోసం సంఘాల సభ్యులు ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇవీ అర్హతలు..

స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండి కరెంట్ బిల్లు నెలకు కనీసం రూ.200 పైగా రావాలి. ఇంటి పైకప్పు స్లాబుతో ఉండాలి. బ్యాంకులో ఎలాంటి రుణ బకాయి ఉండొద్దు.



ఓ ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసిన సౌర పలకలు

రూ.1.60 లక్షల రుణం..

- రాందాస్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్



సౌర విద్యుత్తు యూనిట్లతో కలిగే లాభాలను మహిళలకు వివరిస్తున్నాం. ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్తును గ్రిడ్ వారికి విక్రయిస్తే యూనిట్‌కు రూ.4.60 చెల్లిస్తారు. ఏర్పాటుకు ముందుకొస్తే స్త్రీ నిధి ద్వారా రూ.1.60 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తాం.

హైందవ ధర్మాన్ని కాపాడాలి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే గొప్పదైన హైందవ ధర్మాన్ని కాపాడాలని అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ అన్నారు. జిల్లా కేంద్రం గంగాస్థాన్ ఫేస్-2 ఉత్తర తిరుపతి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, జయలక్ష్మీమాత అన్నపూర్ణ మందిరాన్ని శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి ప్రసంగించారు. మరిన్ని ఆధ్యాత్మిక క్షేత్రాలు అభివృద్ధి చెందాల్సి ఉందని, ఇందుకు అవసరమైన భూమి కోసం పీసీసీ అధ్యక్షుడి వంటి నాయకులు సహకరించాలన్నారు. ఆధ్యాత్మిక గురువులు, స్వాములు కావడం చాలా కష్టమని.. వారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కోరారు. కులమతాలకు అతీతంగా రాష్ట్రం అభివృద్ధి చెందాలని కోరుకునే వ్యక్తుల్లో తానే మొదటివాణ్ని అని పేర్కొన్నారు. ఉత్తర తిరుపతి అభివృద్ధికి ఎలాంటి సాయం కావాలన్నా తప్పకుండా చేస్తానని తెలిపారు. మహేశ్‌కుమార్ గౌడ్‌ను స్వామిజీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ హెచ్.సంపత్, కేశ వేణు, నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



ఉత్తర తిరుపతి కల్యాణ మండపం, అన్నపూర్ణ మందిరం ప్రారంభిస్తున్న గణపతి సచ్చిదానందస్వామిజీ, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

చదువుతోనే భవిష్యత్తు

నవీపేట, న్యూస్‌టుడే : చదువుతోనే మంచి భవిష్యత్తు ఉంటుందనే విషయాన్ని ప్రతి విద్యార్థిని గమనించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. నవీపేట మండలం మోకన్‌పల్లి కేజీబీవీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. తరగతి గదులకు వెళ్లి బాలికలతో పలు అంశాలపై చర్చించారు. ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయినులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి సూచనలు చేశారు. హాజరు పట్టిక పరిశీలించారు.



హాజరుపట్టిక పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

21 నుంచి జానకంపేట్ రైల్వేగేటు మూసివేత

ఇందూర్ సిటీ : నిజామాబాద్ రైల్వే స్టేషన్, జానకంపేట్ మధ్య ఉన్న లెవల్ క్రాసింగ్ గేట్ (జన్నేపల్లి-పాల్దా గ్రామాలను కలిపేది) ఈనెల 21 నుంచి 23 వరకు మూసివేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే నిజామాబాద్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ చారి శుక్రవారం తెలిపారు. అటుగా వచ్చే వాహనాలు బైపాస్ మీదుగా అర్సపల్లికి మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. పనుల నిర్వహణలో అంతరాయం లేకుండా ఈ విషయాన్ని ఆరో ఠాణా పోలీసులకు విజ్ఞప్తి చేశామన్నారు.

రోడ్లపైనే వ్యాపారాలు ... 16లో

అట్టహాసంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: మండలంలోని సిర్నాపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కమిటీ, యువజన సంఘాల సహకారంతో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. అండర్-17, అండర్-14 బాలబాలికల విభాగాల్లో మొత్తం 56 జట్లు పాల్గొన్నాయి. అండర్-17 బాలుర విభాగంలో ధర్పల్లి జోన్ విజేతగా నిలవగా.. కమ్మర్‌పల్లి జోన్ ద్వితీయ, బాలికల విభాగంలో ధర్పల్లి జోన్ ప్రథమం, నిజామాబాద్ జోన్ ద్వితీయంలో నిలిచాయి. అండర్-14 బాలుర విభాగంలో ధర్పల్లి జోన్ విజేతగా నిలవగా.. డిచ్‌పల్లి జోన్ రన్నరప్‌గా, బాలికల విభాగంలో బాల్కొండ జోన్ మొదటిస్థానంలో, ధర్పల్లి జోన్ రెండో స్థానం కైవసం చేసుకుంది. తహసీల్దార్ వెంకట్రావ్, ఎంఈవో శ్రీధర్, పీడీ రాజ్‌కుమార్ విద్యాసాగర్‌రెడ్డి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న విద్యార్థులు

ఉచిత బియ్యం మరో నాలుగేళ్లు

గరీబ్ కల్యాణ అన్న యోజన పథకం పొడిగింపు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే

రేషన్ లబ్ధిదారులకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ అన్న యోజన పథకం కింద పేదలకు బియ్యం అందజేస్తుంది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఈ పథకాన్ని 2028 డిసెంబరు వరకు అమలు చేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,55,591 రేషన్‌కార్డుదారులకు లబ్ధి కలగనుంది. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు ఐదు కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నారు.

కార్డుల వివరాలు
కామారెడ్డి - 2,53,548
నిజామాబాద్: 4,02,043

2021 నుంచి..

కరోనా విపత్తు సమయం నుంచి కేంద్రం రేషన్ లబ్ధిదారులకు ఉచిత బియ్యం అందిస్తోంది. అంతకు ముందు కిలోకు ఒక్క రూపాయి చొప్పున డబ్బులు తీసుకుని బియ్యం పంపిణీ చేశారు. రెండేళ్ల పాటు ప్రతి మూడు నెలలకోసారి పథకం గడువు పొడిగిస్తూ వెళ్లారు. ఆ తర్వాత 2023లో ఏడాది పాటు పథకాన్ని పొడిగించిన ప్రభుత్వం తాజాగా మరో నాలుగేళ్ల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.



పోషకాల మిళితం

రేషన్‌లబ్ధిదారులకు కేంద్రం ఏడాదికాలంగా పోషక బియ్యం పంపిణీ చేస్తుంది. సాధారణ బియ్యంలో పోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపి సరఫరా చేస్తున్నారు. ఒక క్వింటాల్ సాధారణ బియ్యానికి కిలో పోర్టిఫైడ్ బియ్యం కలుపుతున్నారు. మిల్లింగ్ చేసి బస్తాల్లో నింపేటప్పుడే పోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపే విధంగా అన్ని మిల్లుల్లో బ్లెడింగ్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చారు. ఈ బియ్యం ద్వారా ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్- బీ వంటి పోషకాలు అందుతున్నాయి.

రోడ్లపైనే వ్యాపారాలు

☛ తప్పని ట్రాఫిక్ తిప్పలు

పరిశీలన

ఎక్కడికక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేయ డంతో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పాదచారులు నడ వడానికి సైతం ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. తరచూ ట్రాఫిక్ అంత రాయం ఏర్పడి అవస్థలు పడుతు న్నారు. ముఖ్యంగా బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది.

అంబులెన్సులు వెళ్లలేక..

● 1.50 లక్షల పైనే ◆ 40 ■ 4 ☛ 15

నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ నుంచి ప్రధాన బస్టాండ్ వరకు ఎక్కడిక్కడ చిరు వ్యాపారులు ఆక్రమించేశారు. ఖలీల్‌వాడీలో రోడ్లపైనే తోపుడు బండ్లు, నడక మార్గంపైన కుర్చీలు వేసి వ్యాపారం చేస్తున్నారు. ఆటోలు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో నగరంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. జీజీహెచ్ వద్ద అంబులెన్సులు వెళ్లటానికి ఇబ్బందిగా ఉండటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం



గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్లపైనే తోపుడు బండ్లు

● నిత్యం రాకపోకలు ◆ రద్దీ ప్రాంతాలు
■ పార్కింగ్ స్థలాలు ☛ అనువైన ప్రాంతాలు

ఇష్టారీతిన పార్కింగ్

● 10 వేలు ◆ 5 ■ లేవు ☛ 4

పట్టణంలోని ప్రధాన రహదారి వెంట రోడ్ల మీద పార్కింగ్‌తో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో వాహనాలు నిలపడంతో ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించడంతో పాదచారులు అవస్థలు పడుతు న్నారు. దీనిపై కమిషనర్ శ్రీహరి రాజును 'న్యూస్‌టుడే' వివ రణ కోరగా.. పోలీసు శాఖ వారితో కలిసి ట్రాఫిక్ ఇబ్బం దులు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.

- బాన్సువాడ పట్టణం



పార్కింగ్ స్థలాలు లేక..

● 60 వేలు ◆ 10 ■ లేవు ☛ 6

ఏటా కామారెడ్డి జిల్లా కేంద్రం పరిధితో పాటు వాహనాల సంఖ్య పెరగడంతో పార్కింగ్ స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో పార్కింగ్ జోన్ల ఏర్పాటు కొలిక్కి రావడం లేదు. నాలుగేళ్ల క్రితం కొత్తబస్టాండు, సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, జేపీఎన్‌రోడ్డు, సిరిసిల్లరోడ్డు, ఇందిరాచౌక్ తదితర రద్దీ ప్రాంతాల్లో అధికారులు పరిశీలన చేసి యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత క్షేత్రస్థాయికి వచ్చి సమస్య పరిష్కారానికి అడుగులు వేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై టీపీవో గిరిధరను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పార్కింగ్ జోన్ల విషయమై గతంలోనే స్థలాల ఎంపికకు చర్యలు చేపట్టున్నాం. ఈ సమస్య పరిష్కారానికి దృష్టి పెడతామన్నారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



కామారెడ్డిలో సుభాష్‌రోడ్డులో రహదారి మధ్యలో వాహనాలు

ఐదు నెలలుగా బిల్లులు రావట్లే

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం, కలెక్టరేట్: రక్తపరీక్షల కోసం ఆరోగ్యకేంద్రాల నుంచి నమూనాలను సేకరించి టీహబ్‌కు వాహనాల్లో తెస్తున్నారు. వాహనాలకు సంబంధించి బిల్లులు ఐదు నెలలుగా రాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు రెండు నెలల బిల్లులు చెల్లింపులకు మాత్రమే ప్రోసెసింగ్ వచ్చాయి. అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాల్సి ఉన్నా స్పందన కరవైంది.

ఐదు వాహనాలు.. 12500 కి.మీ

టీ హబ్ పరిధిలో ఐదు వాహనాలు ఉన్నాయి. ఇవి నిత్యం ఐదు మార్గాల్లో నమూనాలు సేకరిస్తున్నాయి. ఒక్కో వాహనం నెలకు 2500 కి.మీ రాకపోకలు సాగించింది. ఒక్కో వాహనానికి సంబంధించి రూ.33 వేల చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రూ.8.25 లక్షలు చెల్లించాలి. బిల్లులు మంజూరు చేయాలని సిబ్బంది పలుమార్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మొర పెట్టుకున్నా స్పందన కరవైంది. కొంతకాలం క్రితం వాహనాలపై సిబ్బంది పీహెచ్‌సీలకు వెళ్లి నమూనాలను సేకరించారు. రాష్ట్రశాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. దసరా పండగ వరకు బకాయిలు వస్తాయని ఆశతో నిరీక్షించిన వారికి నిరాశే మిగిలింది. ఈ విషయమై న్యూస్‌టుడే వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఇప్పటికే రెండు నెలలకు సంబంధించి బకాయిల చెల్లింపు లకు అనుమతి వచ్చిందన్నారు. మిగతా బిల్లుల చెల్లింపులపై దృష్టి పెడతామన్నారు.

20న చదరంగం క్రీడలు


నిజామాబాద్ క్రీడా విభాగం: బాలబాలికల విభాగంలో అండర్-15 జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఈనెల 20న నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. నగరంలోని అభ్యాస పాఠశాలలో పోటీలుంటాయన్నారు.



ఆధ్యాత్మిక కేంద్రం.. ఆహ్లాదకర వాతావరణం

ఎత్తయిన కొండ.. పచ్చని చెట్లు.. చల్లని వాతావరణంతో భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదం పంచుతోంది కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానం. బీర్కూర్ నుంచి పొతంగల్ ప్రధాన రహదారిపై నుంచి చూస్తే చుట్టూ పచ్చని పొలాలతో కనువిందు చేస్తోంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. అచ్చం తిరుపతిలో ఉన్న దేవాలయాన్ని తలపిస్తోందని భక్తులు పేర్కొంటున్నారు.

– ఈనాడు, నిజామాబాద్



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాజట్టు

డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాజట్టు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్ తెలిపారు. వరంగల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు సుద్దపల్లి సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో శిక్షణ పొందారని ప్రిన్సిపల్ నళిని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ స్వప్న, వైస్ ప్రిన్సిపల్ వనిత, కోచ్ మౌనిక, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్రీలత అభినందించారు. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు వనజ, సరిత ఎంపికవడంపై పీడీ గంగామోహన్, ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.



ఎంపికైన బాలికలతో ప్రతినిధులు

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: వ్యవసాయ అనుబంధ రంగాల రక్షణ కోసం స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఎన్ఆర్ భవనంలో వ్యవసాయ అనుబంధ రంగాలు-ప్రభుత్వ వైఖరి అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులకు రుణమాఫీ అమలు చేయాలని పేర్కొన్నారు. నీరు, ప్రాజెక్టులు, వ్యవసాయ రంగ రక్షణ కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పాపయ్య, భూమయ్య, నాగయ్య, కిరణ్‌కుమార్, సాయిరెడ్డి, పర్వయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు

జిల్లాకు పేరు తీసుకురావాలి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గ్రామీణ మండలం గుండారం, మల్కాపూర్(ఏ)లోని జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్, తెలుగు, ఉర్దూ మీడియం బడులను శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాల వివరాలను అడిగారు. హాజరు పట్టికలు పరిశీలించారు. మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.



గుండారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

అడ్డుపడినా.. సర్వే ఆగదు

మంచిప్ప(మోపాల్), న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 21/ఏ పనుల వద్ద మంచిప్ప పెద్ద చెరువు పరిసరాల్లో నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం సర్వే చేశారు. ఇటీవల సర్వే పనులకు వెళ్లిన అధికారులు స్థానికులు అడ్డుకొని వివరాలు వెల్లడించిన తర్వాత పనులు చేపట్టాలని పట్టుబట్టడంతో నిలిపివేశారు. శుక్రవారం మళ్లీ సర్వే పనులు మొదలుపెట్టిన అధికారులు వివరాలు వెల్లడించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఈడీ గంగాధర్ అడ్డుపడిన వారిని సముదాయించారు. మంచిప్ప చెరువు నీటి సామర్థ్యంపై మూడు దశల్లో సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఏ దశలో భూములు ముంపునకు గురికాకుండా ఉంటాయో అభిప్రాయం తెలిపితే దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాదని పనులకు అడ్డు పడితే.. పోలీసుల రక్షణలో సర్వే చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం సర్వే పనులు సాఫీగా సాగాయి.



స్థానికులను సముదాయిస్తున్న డీఈ గంగాధర్



ఉపకార వేతనాల విడుదలకు డిమాండ్

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ డిమాండ్ చేశారు. తెవివి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనాల పథకానికి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని మండిపడ్డారు. వర్సిటీ కార్యదర్శి అమృత్‌చారి, నాయకులు అజయ్, లెనిన్, శ్రీకాంత్, శేఖర్, తరుణ్ పాల్గొన్నారు.

వాలంటీర్ల ఎంపిక

తెవివి క్యాంపస్: తెవివిలో శుక్రవారం వెస్ట్‌జోన్ ముందస్తు గణతంత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రీ రిపబ్లిక్ దినోత్సవానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎంపిక చేశారు. పరేడ్ గురించి ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ శ్రీరామకృష్ణ వివరించారు. సమన్వయకర్త రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు స్వప్న, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని వినతి

నవీపేట, ఎడపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బినోల సహకార సంఘం అధ్యక్షుడు హన్మాండ్ల తహసీల్దారు వెంకటరమణకు శుక్రవారం వినతి పత్రం అందించారు. వరి కోతలు ప్రారంభమైనా ఇప్పటి వరకు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ఆయన ఆరోపించారు. రైతుల ఇబ్బందులు గుర్తించి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ భాజపా నాయకులు ఎడపల్లి ఉప తహసీల్దార్ అనూషకు వినతిపత్రం అందజేశారు. కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. రాంచందర్, శ్రీనివాస్, సుధాకర్, అరుణ్ తదితరులు ఉన్నారు.

అటవీ శాఖ రేంజ్ కార్యాలయం తరలింపు

మోపాల్, న్యూస్‌టుడే: మోపాల్ మండలం రామేశ్వర్‌పూర్ తండా పరిసరాల్లో ఏర్పాటు చేసిన అటవీ శాఖ దక్షిణ రేంజ్ కార్యాలయం సామగ్రిని శుక్రవారం నిజామాబాద్ డివిజన్ కార్యాలయానికి తరలించారు. నాలుగు నెలల కిందట రామేశ్వర్‌పూర్ తండా పరిసరాల్లోని నూతన భవనంలోకి మార్చారు. కానీ సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడం, ఇతర కారణాల దృష్ట్యా సిబ్బంది పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోవడంతో తరలించినట్లు ఎఫ్‌ఆర్వో రాధిక తెలిపారు. అయినప్పటికీ నిత్యం రామేశ్వర్‌పూర్ తండా కార్యాలయం నుంచి కార్యకలాపాలు, సేవలు నిరంతరం కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: ఆర్యనగర్ టెలిఫోన్ కాలనీలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం, మురుగు నిండడంతో ఇబ్బందిగా ఉంది. - మోహన్, స్థానికుడు

సమాధానం: కార్మికులను పంపించి చర్యలు తీసుకుంటాం. - సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, జోన్-2, నగరపాలక సంస్థ

సమస్య: గ్రామీణ మండలం గుండారం గ్రామంలోని ఒడ్డెర కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - గణేష్, గ్రామస్థుడు

సమాధానం: రెండు రోజుల్లో అన్ని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోని ఆర్టీసీ కాలనీలో 15 రోజులుగా తాగునీరు రావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. - సత్యనారాయణ, స్థానికుడు

పరిష్కారం: ఈ ప్రాంతంలోని పైప్‌లైన్లు మరమ్మతు చేశాం. మళ్లీ లీకేజీ ఉంటే గుర్తించేందుకు ముందు జాగ్రత్త చర్యగా గుంతలు పూడ్చలేదు. మరమ్మతులు పూర్తికాగానే నీటిని సరఫరా చేస్తాం. - పావని, ఏఈ

సమస్య: కోటగల్లీ మైసమ్మ గుడి ఎదుట గల్లీలోకి చెత్త బండి 15 రోజులుగా రావడం లేదు. - అంకం శ్రీకాంత్, కోటగల్లీ

పరిష్కారం: చెత్త బండి రిపేర్‌లో ఉంది. రెండు మూడు రోజుల్లో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తాం. - సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

- న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్ నిజామాబాద్ గ్రామీణం, నిజామాబాద్ నగరం

పీసీసీ అధ్యక్షుడికి సత్కారం



సిరికొండ, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సిరికొండ గౌడసంఘం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్లను అందిస్తుందని, గౌడన్నలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహేశ్‌కుమార్ గౌడ్ వారికి సూచించారు. గణేష్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

సిలబస్‌లో వేగం పెంచండి



అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈవో

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: త్వరలో నిర్వహించే అర్ధసంవత్సర పరీక్షల నేపథ్యంలో సిలబస్‌లో వేగం పెంచాలని డీఐఈవో రవికుమార్ అధ్యాపకులను ఆదేశించారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, సిలబస్, విద్యార్థుల హాజరుపై సమీక్షించారు. విద్యార్థులు రోజూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు

ధర్పల్లి: ధర్పల్లి మండలంలోని 14 అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మూత్రశాలల నిర్మాణానికి ప్రభుత్వం రూ.7.72 లక్షల నిధులు మంజూరు చేసిందని ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. ధర్పల్లి, గోవింద్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలల నిర్మాణానికి స్థలాన్ని శుక్రవారం పంచాయతీరాజ్ ఏఈ బాలాజీతో కలిసి పరిశీలించారు.

పరీక్ష రాశారు.. ప్రతిభ చాటారు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో సాయిరెడ్డి



కల్దుర్కిలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు భాస్కర్

నిజామాబాద్ విద్యావిభాగం, సుభాష్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని కస్బాగల్లీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8, 9, 10తరగతుల విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు ప్రారంభమయ్యాయి. 'ఇంటర్నెట్ వినియోగం - లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు వ్యాసాలు రాశారు. పోటీల్లో భాగ్యలత ప్రథమ, మాధుర్య ద్వితీయ, మాహీన్ కౌసర్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో సాయిరెడ్డి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మాధవిలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ మండలం కల్దుర్కి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు అనే అంశంపై వ్యాసాలు రాశారు. ఇందులో ప్రథమ స్థానంలో నానేశ్వరి, ద్వితీయ జగదీశ్వర్, తృతీయ స్థానంలో సౌజన్యలు నిలిచారు. విజేతలకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు జవహర్ మహేష్‌చంద్ర, బాలాజీ, దుర్గాప్రసాద్, శంకర్‌లు ప్రశంసాపత్రం, బహుమతులు అందించారు.

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సుద్దపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసాలు రాశారు. పోటీల్లో అంజలి ప్రథమ, నిత్యశ్రీ ద్వితీయ, విద్య తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేశ్, సమన్వయకర్త అశోక్‌శర్మ ధ్రువపత్రాలు, బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నరేశ్

వరి దిగుబడిలో బాన్సువాడ ప్రథమం



కోటగిరిలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

కోటగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వరి దిగుబడిలో బాన్సువాడ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలుస్తుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ కూడా ఇస్తామన్నారు. విభేదాలు వీడి నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సేవకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, విండో అధ్యక్షుడు సిద్ధు, ఏఎంసీ ఛైర్మన్ హన్మంతు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శంకర్‌పటేల్, కోటగిరి, పోతంగల్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు షాహిద్, శంకర్, నాయకులు లక్ష్మణ్, మనోహర్, పవన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వర్ని, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి, సోయా కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, సిబ్బంది సూచించారు. జాకోరా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని జాకోరా, జలాల్‌పూర్‌లో వరి, సైదాపూర్‌లో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ దశరథ్ శుక్రవారం ప్రారంభించారు. చందూర్ వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్‌యాదవ్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సురేష్‌బాబా, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అంబర్‌సింగ్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ధర్పల్లిలో..

ధర్పల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు

నిజామాబాద్ గ్రామీణం: మండలంలోని కేశాపూర్ గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు నుంచి బోనాలు తీశారు. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.



కేశాపూర్‌లో..

ముగిసిన బ్రహ్మోత్సవాలు

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా, పూర్ణాహుతి హోమం, చక్రస్నానం, సామూహిక కుంకుమార్చన, గరుడవాహన సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు సబ్‌కలెక్టర్ అభినందన



బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన బోధన్‌లోని శ్రీవిజయసాయి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల్ని సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అభినందించారు. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో విద్యార్థులు సబ్‌కలెక్టర్‌ను కలిశారు. ఇటీవల పటాన్‌చెరులో క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఓంకార్, తేజస్, కౌశిక్, క్రాంతి రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి సాధించడం ప్రశంసనీయమని సబ్‌కలెక్టర్ అన్నారు. త్వరలో జాతీయస్థాయిలో జరిగే పోటీల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, మేనేజర్ చక్రవర్తి, యోగామాస్టర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ యంత్రాల అందజేత

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ దోమల మందు పిచికారీ యంత్రాలను 11 మంది మలేరియా సబ్‌యూనిట్ అధికారులకు అందజేశారు. యంత్రాలను సిబ్బందికి అప్పగించి పక్కా ప్రణాళికతో దోమల మందు పిచికారీ చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి తుకారాం రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, ఏఎంవో సలీం, ఎం.శంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీ యంత్రాలు అందజేస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ

చకచకా వరికోత

జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. రైతులందరూ వరి కోత యంత్రాల కోసం పోటీ పడుతున్నారు. గంట సేపు యంత్రంతో కోత చేస్తే గంటకు రూ.2200 వరకు తీసుకునేవారు. డిమాండ్ పెరగడంతో యంత్రాల యజమానులు రూ.300 వరకు ధరలు పెంచేశారు. వర్షాలు పడి ఇబ్బందుల్లో ఉన్నామని ఇలా ధరలు పెంచేస్తే మరింత భారమవుతుందని రైతులు వాపోతున్నారు.



మోస్రా, చందూర్ మధ్యలో వరికోత చేస్తున్న యంత్రం

- ఈనాడు, నిజామాబాద్

ఇండియన్ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం

పోతంగల్, న్యూస్‌టుడే: ఖాతాదారులు ఇండియన్ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ఆ బ్యాంకు ఏజీఎం రాజేశ్వర రెడ్డి అన్నారు. పోతంగల్‌లో బ్యాంకు శాఖను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ జోన్‌లో పోతంగల్‌తో పాటు 83బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో బ్యాంకు ప్రథమస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం అశోక్ చౌహాన్, జోనల్ మేనేజర్ రాజ్‌కుమార్, మేనేజర్ అరవింద్, నాయకులు శంకర్‌పటేల్, శాంతీశ్వర్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

646 పశువులకు టీకాలు

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేట మండలం మోకన్‌పల్లిలో 646 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చినట్లు పశువైద్యాధికారి నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్ర విచారణకు డిమాండ్



వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మాక్లూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారిణిపై సమగ్ర విచారణ జరిపించాలని టీపీటీఎఫ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సుధాకర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఏవో ప్రశాంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఎస్‌వోపై వరుసగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

హస్తకళలపై అవగాహన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధానిలోని హస్త కళా సేవా కేంద్రం, కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ సంయుక్తాధ్వర్యంలో నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో హస్తకళలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి కళలపై అవగాహన కల్పించడం పట్ల అతిథులు హర్షం వ్యక్తం చేశారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. హస్త కళల అభివృద్ధి అధికారి చంచల్‌పాల్, సుమలత, డామస్, మనోహర్, ఆశాలత, గోపిక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హస్త కళల అభివృద్ధి అధికారి చంచల్‌పాల్

ముగిసిన శిక్షణ

మోపాల్, న్యూస్‌టుడే: మోపాల్, నిజామాబాద్ గ్రామీణ మండలంలోని గ్రామ మండిలిటీ సహాయకులకు మోపాల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. మిషన్‌భగీరథ ఎస్ఈ రాజేంద్రకుమార్ పాల్గొని శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ వినయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివతేజ తదితరులు ఉన్నారు.



ధ్రువపత్రాలు అందజేసిన ఎస్ఈ రాజేంద్రకుమార్

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌లో శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో గ్రామ మండలిటీ సహాయకులకు శిక్షణ తరగతులు ముగిశాయి. నాలుగు రోజులపాటు శిక్షణ పొందిన సహాయకులకు ధ్రువపత్రాలు అందించారు. ఈఈ నరేష్, డీఈ గంగారాం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలతో మంచి నీటి సహాయకులు

సీపీ కల్మేశ్వర్‌కు సన్మానం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ కమిషనరేట్ సీపీ కల్మేశ్వర్‌ని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.



ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణాచారి

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిజామాబాద్ నగరానికి చెందిన డి.లక్ష్మణాచారి నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచన మేరకు పార్టీ కార్మిక విభాగం ప్రకాష్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.



27న స్వేరోస్ జాతీయ సమావేశం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: స్వేరోస్ జాతీయ సమావేశం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి పేర్కొన్నారు. శుక్రవారం రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో గోడ ప్రతులు ఆవిష్కరించి మాట్లాడారు. సిద్దిపేటలో ఆదివారం జాతీయ సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అవినాష్, సురేష్, సతీష్, గంగాధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రూ.4 లక్షల నగదు.. 5 తులాల బంగారం చోరీ

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: పట్టపగలు బంగారం, నగదు చోరీ జరిగిన ఘటన జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. గ్రామంలోని 8వ నంబరు వీధికి చెందిన మల్లి గంగాధర్ రిటైర్డ్ పనిపై ఆర్మూర్‌కు వెళ్లారు. ఆయన భార్య ఇంటికి తాళం వేయకుండా పక్కింటికి వెళ్లారు. గంట తర్వాత తిరిగి వచ్చి చూసే సరికి బీరువా తెరిచి ఉంది. బీరువాలోని రూ.4 లక్షల నగదు, 5 తులాల బంగారం నగలు చోరీకి గురయ్యాయి. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిట్టాపూర్ శివారులో దారి దోపిడీ

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేట మండలం మిట్టాపూర్ శివారులో శుక్రవారం తెల్లవారుజామున దారి దోపిడీ ఘటన కలకలం రేపింది. ఎస్సై మోహన్‌రెడ్డి, గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని శివతండాకు చెందిన నరేశ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా బాసరకు వెళ్తున్నారు. మిట్టాపూర్ శివారులోకి రాగానే అతడి వాహనాన్ని మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు అడ్డగించారు. అనంతరం నరేశ్‌కుమార్‌పై దాడి చేసి అతని నుంచి రూ.2,500 నగదు, చరవాణి ఎత్తుకెళ్లారు. తర్వాత సదరు దుండగులు నాగేపూర్ వద్ద అదే రోజు ఉదయం వాకింగ్ చేస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను బెదిరించి రెండు చరవాణులను అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న నాగేపూర్ వాసులు దుండగులను పట్టుకునేందుకు వెంబడించగా చిక్కకుండా నవీపేట మీదుగా పారిపోయారు. నరేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అటకాయించి.. దాడి చేసి.. అపహరణ

నవీపేట, న్యూస్‌టుడే: వాహనదారుడిని అటకాయించి దాడి చేసిన ఘటన నవీపేట శివారులో చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి కథనం ప్రకారం.. నిజామాబాద్ కల్యాపూర్‌కు చెందిన కాశం శ్రీనివాస్ నవీపేటలో నివాసముంటున్న కూతురు శ్రీలత ఇంటికి గురువారం అర్ధరాత్రి తర్వాత ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. నవీపేట శివారులోని ఓ ప్రైవేటు పాఠశాల వద్దకు రాగానే గుర్తు తెలియని ఇద్దరు ముగ్గురు ద్విచక్ర వాహనాన్ని అటకాయించి ఆపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.4 వేల నగదు, చరవాణి లాక్కున్నారు. అనంతరం సదరు యువకులు నంబరు ప్లేటులేని ద్విచక్ర వాహనంపై ఘటనాస్థలి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రం మూడో ఠాణా పరిధిలోని ఓ ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిని బెదిరించి బంగారు గొలుసు తీసుకెళ్లిన దోపిడీ దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీకి చెందిన చిందం సిద్ధిరాములు (70) ఈ నెల 16న ఇంట్లో ఉండగా.. గుర్తు తెలియని దుండగులు ఆయనపై కత్తితో దాడి చేసి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. వృద్ధుడి మనవడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగర సీఐ శ్రీనివాస్‌రాజ్ ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలు, కొందరు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నిందితుడు నజీమ్, ఆయనకు సహకరించిన ఆటో డ్రైవర్ కరీంలను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు గొలుసు, రెండు చరవాణులు, ఆటో, ఓ కత్తి స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండుకు తరలించారు. కేసు ఛేదనకు కృషి చేసిన నగర సీఐ, ఎస్‌హెచ్‌వో మహేశ్, సిబ్బందిని సీపీ అభినందించారు.

సెల్‌టవర్ ఎక్కిన రైతు

☛ వారసత్వ భూమిలో భాగం ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: వారసత్వంగా సంక్రమించిన భూమిలో తనకు భాగం ఇవ్వకుండా సోదరులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రశ్నిస్తే భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఇందల్‌వాయి మండలం సిర్నాపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తేలు లక్ష్మణ్‌కి ముగ్గురు కుమారులు. వీరికి నలుగురికి సాగు భూమి ఉంది. రెండో కుమారుడు లక్ష్మణ్ కుటుంబ పోషణకు గల్ఫ్ వెళ్లగా మిగతా ఇద్దరు సోదరులు తండ్రి పేరు మీద భూమిని పట్టా చేయించుకున్నారు. ఇద్దరిని పిలిచి అడిగితే స్పందించడం లేదని, బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తనకు ఇద్దరు కూతుళ్లున్నారని, వారసత్వంగా రావాల్సిన భూమి ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని సెల్ టవర్ ఎక్కారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై మనోజ్‌కుమార్ సమస్యను తహసీల్దార్‌తో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. అనంతరం గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ భూమిపై ఎస్సై బాధితుడితో వివరాలు తీసుకొని చర్చించారు. తగిన ఆధారాలతో వస్తే న్యాయం చేస్తామని సమాధానమిచ్చి పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఎడపల్లి శివారులోని పెద్దవాగు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. బోధన్ పట్టణానికి చెందిన అర్షద్ నవీపేట నుంచి బోధన్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నిజామాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అర్షద్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై బాధితుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరికి జరిమానా

రెంజల్, న్యూస్‌టుడే: రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన సాయినాథ్, శివశంకర్ అనే ఇద్దరు వ్యక్తులు తాగిన మైకంలో డయల్ 100కు ఫోన్ చేయడమే కాకుండా న్యూసెన్స్ చేయడంతో వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. న్యూసెన్స్ చేసిన ఇరువురిని శుక్రవారం బోధన్ ద్వితీయ శ్రేణి న్యాయస్థానంలో ఎదుట హాజరుపర్చగా గాక పైన తెలిపిన విధంగా శిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.

ఒకరి అదృశ్యం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రెండో ఠాణా పరిధిలో యువతి అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని దారుగల్లీకి చెందిన షేక్ మహబూబ్(35) ఈనెల 16న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆమెకి లభించలేదు. దీంతో ఆయన భార్య ఫిర్యాదు మేరకు శుక్రవారం అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ తెలిపారు.

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

ఓటు నమోదు చేసుకోవాలి

ఏర్గట్ల(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి సత్యానంద్ అన్నారు. ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. మేధావి వర్గంగా పిలువబడే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉత్తములను శాసనమండలికి పంపించడానికి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.



ఓటరు నమోదు దరఖాస్తులు ప్రదర్శిస్తున్న సత్యానంద్

వాలీబాల్ ఎంపిక పోటీలు

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఏర్గట్ల, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ జట్టుకు ఎంపిక చేశారు. అండర్-14, 17 జట్లను ఎంపిక చేసినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు.



ఇవిగో నిధులు.. చేయాలి పనులు!



న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

● పల్లె రహదారులకు రూ. 10 కోట్లు

పల్లె దారులకు మహర్దశ పట్టనుంది. వర్షం పడితే చిత్తడిగా మారే మట్టిదారులు తారుగా మారనున్నాయి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సీఆర్ఆర్(నియోజకవర్గ రూరల్ రోడ్లు) కింద ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు నిధులు మంజూరు చేసింది. పనులను పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టనున్నారు. ఏటా ఉపాధి హామీ కింద గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించే వారు. ఇందులోనే రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు రూ. 5 కోట్ల చొప్పున కేటాయించారు. డొంకేశ్వర్, ఆర్మూర్, బాల్కొండలో భీమ్‌గల్, మెండోరా, వేల్పూర్ మండలాలకు నిధులు ఇచ్చారు. ఈ నిధులతో మట్టిరోడ్లను తారురోడ్లుగా మార్చనున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న పల్లెవాసుల కల నెరవేరనుంది.

నియోజకవర్గం	నిర్మించాల్సిన రోడ్డు (కి.మీ)	పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఆర్మూర్	4.90	2	5
బాల్కొండ	4.80	3	5

ఏళ్ల కల నెరవేరనుంది

నర్సాపూర్-మెండోరా గ్రామాల మధ్య రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. భీమ్‌గల్, భీంనగర్, లింబాద్రి గుట్ట వైపు ఈ దారి గుండా నేరుగా వెళ్లవచ్చు. నిత్యం 200 మంది వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. మట్టి రోడ్డు కావడంతో వానాకాలం ఇబ్బందిగా ఉంటుంది. ఈ రోడ్డుకు రూ 1.85 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభమవుతాయి తారురోడ్డుగా మారితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుంది. గ్రామస్థులు ఏళ్ల కల నెరవేరుతుంది.



– న్యూస్‌టుడే, మెండోరా (కమ్మర్‌పల్లి)

మూడు గ్రామాలకు..

వేల్పూర్, పచ్చలనడ్కుడ ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుబంధం చేస్తూ మోతెకు పంచాయతీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసింది. ఫలితంగా ఈ మూడు గ్రామాల మధ్య కొత్త రోడ్డు రూపుదిద్దుకుంటుంది. ఇప్పటి వరకు ఈ రోడ్డును రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు వినియోగిస్తున్నారు. మధ్యలో బుడిగెడు చెరువు అలుగు నీరు ప్రవహిస్తుండడంతో అటు, ఇటు రాకపోకలు లేవు. ఈ రోడ్డు నిర్మాణంతో పాటు వంతెన నిర్మిస్తుండడంతో మోతె మీదుగా పచ్చలనడ్కుడ, వేల్పూర్‌కు రాకపోకలు పెరగనున్నాయి. **- న్యూస్‌టుడే, వేల్పూర్**



రూ.2.15కోట్లు మంజూరు

మెండోరా మండలం సావెల్ నుంచి ఏర్గట్ల మండలం తడపాకల్ వరకు తారు రోడ్డుగా మార్చడానికి రూ. 2.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. మార్గమధ్యలో పెద్ద వాగు ఉండటంతో చోదకులు వెల్గటూర్ నుంచి తిరిగి వెళ్తున్నారు. మంజూరైన నిధులతో రెండు కిలో మీటర్ల దూరం వరకు తారుగా మార్చనున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. అలాగే పెద్ద వాగు పై వంతెన నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, బాల్కొండ

అంకాపూర్ నుంచి మునిపల్లి..

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామం నుంచి జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి వయా లక్ష్మాపూర్ పంచాయతీరాజ్ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3.60 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం మట్టి రోడ్డు గుంతలమయంగా ఉంది. ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. బీటీ రోడ్డు పూర్తయితే అంకాపూర్, మునిపల్లి, మునిపల్లి తండా, లక్ష్మాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 500 మందికి సౌకర్యంగా ఉంటుంది. మరో మార్గంలో వెళ్లడం ద్వారా 3 కిలోమీటర్ల దూరం ఎక్కువయ్యేది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే దూరంతో పాటు ప్రయాణ సమయం తగ్గుతుంది. అంకాపూర్‌లో జాతీయరహదారిని కలుపుతూ ఉన్న ఈ మార్గం ద్వారా ప్రయాణికులతో పాటు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



– న్యూస్‌టుడే, ఆర్మూర్ గ్రామీణం

1.7 కిలోమీటర్లకు రూ. 1.32 కోట్లు

డొంకేశ్వర్ గ్రామం నుంచి నూత్‌పల్లికి వందలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కమాన్ నుంచి పెట్రోల్ బంకు మీదుగా వెళ్లడానికి డొంకేశ్వర్ గ్రామ చివరి కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. 1.7 కిలో మీటర్ల తారు రోడ్డు నిర్మాణం కోసం రూ. 1.32కోట్లు మంజూరు చేసింది. రెండు గ్రామాల ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలిగిపోతాయాని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



– న్యూస్‌టుడే, నందిపేట్

సమస్య: పట్టణంలోని మామిడిపల్లి తిరుమల కాలనీలో రోడ్డు నెంబర్ 1లో మిషన్ భగీరథ నీటి పైపు లీకేజీ అవుతోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

- రమేశ్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం.

- రాజు, పుర కమిషనర్, ఆర్మూర్

– న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

భాజపా సభ్యత్వ నమోదు

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ మండల కేంద్రంలో మండల భాజపా అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ అధ్యక్షుడు యామాద్రి భాస్కర్ ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వం నమోదు చేయించారు.

ఇసుక డంపు స్వాధీనం

ఏర్గట్ల(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: తాళ్లరాంపూర్‌లో అక్రమంగా డంపులు పోసి నిల్వ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ నెల 18న ఈనాడులో 'ఉదయం డంపు...రాత్రి తరలింపు' శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ శ్రీలత స్పందించారు. వెంటనే ఆర్ఐ సదానంద్‌ను పంపించి అక్రమంగా నిల్వచేసిన రెండు ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేయించారు.



ఈనాడు కథనానికి స్పందన

బస్టాండ్ పరిసరాలు శుభ్రం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ బస్టాండ్ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని, వ్యర్థాలను అక్కడే వేసి కాల్చేస్తున్నారని 'చెత్త శుద్ధి కరవు.. సేకరణ బరువు' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి పుర కమిషనర్ రాజు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ట్రాక్టర్‌తో శుభ్రం చేయించి, వ్యర్థాలను తొలగించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ. 1000 నుంచి రూ. 10 వేల వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీరు పూర్ణమౌలి పనులను పర్యవేక్షించారు.



ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు విశాల్(ప్రథమ), కీర్తన్ రెడ్డి(ద్వితీయ), సంజన(తృతీయ)కు పాఠశాల యాజమాన్యం గణేశ్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం గణేశ్, తదితరులు

20న సంస్మరణ సభ

బాల్కొండ, న్యూస్‌టుడే: ఈ నెల 20న చలో ముప్కాల్ కార్యక్రమాన్ని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ ఇత్వార్‌పేట లింగన్న పేర్కొన్నారు. తొలితరం అంబేడ్కరైట్‌లు జె. నారాయణ, కోట రాజదాస్‌ల సంస్మరణ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముప్కాల్ జీఎన్ఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన అంబేడ్కరైట్ మేధావి డా. బాలబోయిన సుదర్శన్, ముంబయి నుంచి మూల్ నివాసి మాలాజీ తదితరులు హాజరవుతున్నారని తెలియజేశారు. నేతల ప్రసంగాలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ మార్కండేయ ఆలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పోతుల శివలింగం, వైస్ ఛైర్మన్‌గా కుందారపు శివశంకర్, కార్యదర్శిగా అందె వెంకటగిరి, కోశాధికారిగా మేక సతీష్, సలహాదారులుగా పోగుల నవీన్, గుండు నాగరాజు, మైసరి నవీన్, తౌటు కోటేశ్వర్, ఉప్పులంచి రాందాస్, జక్కుల నర్సయ్య, కట్కం గంగాధర్, కుందారపు శ్రీనివాస్, గడ్డం హరీష్, అంగూరు మన్మోహన్‌లను ఎన్నుకున్నారు.

మరమ్మతులకు నిధులు మంజూరు

భీమ్‌గల్ గ్రామీణ న్యూస్‌టుడే: మండలంలోని పురాణిపేట్, దేవన్‌పల్లి గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతుల నిమిత్తం ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ. 50000 చొప్పున విడుదల చేస్తూ ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవోలు జ్ఞానేశ్వరి, స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, సీనియర్ అసిస్టెంట్ ప్రిన్స్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ...

మోతె(వేల్పూర్), న్యూస్‌టుడే: మండలంలోని మోతెకు చెందిన ఎం. రమణి చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం అందజేశారు. బాధితురాలు నిమ్స్‌లో చేరిన విషయం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి మెరుగైన చికిత్స కోసం ఎల్‌వోసీ మంజూరు చేయించారు.



కేజీబీవీలో గొలుసు మాయం

మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్ కస్తూర్బా పాఠశాలలో గురువారం రాత్రి గౌతమి అనే టీచర్‌కు చెందిన 6 గ్రాముల బంగారు గొలుసు మాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం శిక్షణ ఎస్సై లత, ఏఎస్సై గంగాధర్ విచారణ నిర్వహించారు. సిబ్బందితో పాటు విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దూషించుకున్నారు. కేజీబీవీలో గత కొన్ని రోజులుగా నెలకొన్న వివాదాలకు మీరంటే మీరే కారణమంటూ వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

అవీ...ఇవీ.. అన్నీ

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాల్సిందే

ఆర్మూర్ పట్టణం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని, ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారాం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్మూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, సురేశ్ పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖ డీఈగా రాజేశ్వర్ రావు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ విద్యుత్ డీఈ(ఆపరేషన్)గా పీవీ రాజేశ్వర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థికి ఆర్థికసాయం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణానికి చెందిన శశాంక్ బీబీఏ చదువు కోసం ఈరవత్రి రాందాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఏ రాజశేఖర్ రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ప్రమోద్, రాజ్‌కుమార్, జీవన్, సురేందర్, సతీష్, గోపికృష్ణ, ప్రవీణ్, సాయి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

మాక్లూర్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిక్లిలో మాక్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చికున్ గన్యా, మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధుల గురించి మలేరియా యూనిట్ అధికారి గోవర్ధన్ అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులను హెచ్చరించారు. ఇళ్ల పరిసరాలు, మురుగు కాలువలను పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందితో చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నందిపేట్, న్యూస్‌టుడే: ఉప కేంద్రాల్లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల19వ తేదీన నందిపేట్, మాక్లూర్ మండలాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ అశోక్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7గంటల వరకు కరెంటు ఉండదన్నారు.



చెరువుల నీటి నమూనాల సేకరణ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణ పరిధిలో ఉన్న మల్లారెడ్డి, గూండ్ల, పెర్కిట్ చెరువుల్లో ఫిస్టులిఫెరా సోలారీస్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు నీటి నాణ్యతను పరిశీలించేందుకు శుక్రవారం నమూనాలు సేకరించారు. పరీక్షల అనంతరం చెరువుల శుద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. కార్యక్రమంలో పుర కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీరు పూర్ణమౌలి తదితరులు పాల్గొన్నారు.

'భారాస నాయకుల తీరు ఖండిస్తున్నాం'

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిపై కొందరు భారాస నాయకులు ఠాణాలో ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామని భాజపా జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ అన్నారు. శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో వారిని జాగృతం చేసేందుకు ఎమ్మెల్యే గద్దించి మాట్లాడారని, మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడలేదని స్పష్టం చేశారు. ప్రకాశ్, కిరణ్, ప్రశాంత్, రాజ్‌కుమార్, నరేశ్ చారి, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలు నిర్మించాలి

ఆర్మూర్ పట్టణం: మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో జరిగిన అయిదో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించి, ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. పేదలకు ఇళ్లు కట్టించేవరకు పోరాటాలు చేయాలన్నారు. అంతకు ముందు డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట రాములు, సాయిలు, గంగాధర్, ఎల్లయ్య, భూమన్న, రవి, నాగరాజు పాల్గొన్నారు.

మండల పశువైద్యాధికారిగా నితీష్

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్ మండల పశువైద్యాధికారిగా సూది పెద్ద నితీష్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన కార్యాలయానికి వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. నందిపేట్ మండలం కంఠం గ్రామానికి చెందిన ఈయనకు ఇక్కడే మొదటి పోస్టింగ్ ఇచ్చారు.



గణేష్‌కు నివాళులర్పించిన ఏసీపీ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ మహోత్సవాలు పురస్కరించుకొని ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి సీఐ పురుషోత్తంతో కలిసి కానిస్టేబుల్ గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతంలో మావోయిస్టుల చేతిలో గణేష్ హతమయ్యారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ ఛైర్మన్ కళ్లెం భోజారెడ్డి, బొప్పని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సదరం ధ్రువపత్రం అందజేత

పడగల్(వేల్పూర్), న్యూస్‌టుడే: ఐదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న పడగల్ వాసి మాడవేడి కల్యాణ్‌కు శుక్రవారం స్థానిక నాయకులు సదరం ధ్రువపత్రం అందజేశారు. తనకు వెంటనే పింఛను అందించాలని అధికారులను కల్యాణ్ వేడుకున్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర్, మాజీ సర్పంచులు దొరబాబు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమగ్ర విచారణకు డిమాండ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మాక్లూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారిణిపై సమగ్ర విచారణ జరిపించాలని టీపీటీఎఫ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, సుధాకర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఏవో ప్రశాంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఎస్‌వోపై వరసగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తక్షణమే విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

నందిపేట్, న్యూస్‌టుడే గత ఏడాది మోటార్ సైకిల్ చోరీ చేసిన గోపాల వంశీకి ఆర్మూర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ వేముల దీప్తి ఒక సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. నందిపేట్‌లోని తిమ్మల పోశెట్టికి చెందిన మోటార్ సైకిల్‌ను ఖానాపూర్‌కు చెందిన వంశీ ఎత్తుకెళ్లాడు ఈ ఘటనపై నాటి ఎస్సై రాహుల్ కేసు నమోదు చేసి విచారణ చేసి వాహనాన్ని రికవరీ చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసులో నేరం రుజువుకావడంతో నేరస్తునికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారన్నారు.

డీఏ బకాయిలు ప్రకటించాలి

ముప్కాల్(బాల్కొండ) : డీఏ బకాయిలను తక్షణమే ప్రకటించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యానంద్, ప్రధాన కార్యదర్శి ఓ. రమేష్ కోరారు. 2022 నుంచి ఇప్పటి వరకు ఐదు డీఏలు ప్రకటించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నెల 23న జరుగనున్న మంత్రి మండలి సమావేశంలో చర్చించి కనీసం నాలుగు డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మోడల్ (ఆదర్శ) పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి తంకూర్ సౌరబ్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు పీడీ అప్పారావు శుక్రవారం తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జరిగిన పోటీలకు హాజరైన సౌరబ్ ఉత్తమ ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచాడు. నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనున్నాడు. ప్రధానోపాధ్యాడు శ్యాం, పీడీ అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



సౌరబ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎక్కువ ధరకు విక్రయించుకోవచ్చు

బాల్కొండ, న్యూస్‌టుడే: రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులకు ప్రభుత్వం పలు విభాగాల్లో ప్రయోజనాలు పొందడానికి అవకాశాలు కల్పిస్తుందని ఆ సంఘం ఛైర్మన్ నాగులపల్లి రాజేశ్వర్ అన్నారు. బాల్కొండ రైతు వేదికలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీఈఎక్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇందులో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. పసుపు, మక్కలతో పాటు సోయాబీన్ ఎక్కువ ధరలకు విక్రయించుకోవచ్చని చెప్పారు. విపణిలో పసుపునకు తక్కువ ధర ఉంటే తాము ఎక్కువ ధరకు విక్రయించి ఇస్తామని చెప్పారు. రైతులు 50 శాతం తక్కువ ధరకు గోడౌన్‌లో నిల్వ చేసుకోవడానికి సౌకర్యం కల్పిస్తామని, లారీల కిరాయి సైతం సగం ధరకే వినియోగించుకోవచ్చని అన్నారు. వైస్ ఛైర్మన్ తోట చిన్నయ్య, డైరెక్టర్లు నాగాపూర్ రాజేశ్వర్, నర్సయ్య, గణేష్, ఏఈవో రేష్మా, సీఈవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిపేట్ మండలంలోని అయిలాపూర్ సహకార సంఘం పరిధిలో గల వెల్మల్, నందిపేట్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఛైర్మన్ మీసాల సుదర్శన్ ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్‌ను పొందాలన్నారు. ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకోవద్దని సూచించారు. వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, నాయకులు మంద మహిపాల్, జీఆర్ రాజేందర్, మచ్చర్ల సాయన్న, కొత్తూర్ రాజేశ్వర్, భరత్, చింతకుంట సురేశ్, సయ్యద్ హుస్సేన్, మురళి, వ్యవసాయ శాఖ, సహకార సిబ్బంది పాల్గొన్నారు.



వెల్మల్‌లో..



నందిపేట్‌లో...



ఉప్లూర్‌లో..

భీమ్‌గల్ గ్రామీణం: భీమ్‌గల్ మండలం మెండోర గ్రామంలో సెర్ప్ ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఏపీఎం రవీందర్, సీసీలు శ్రీనివాస్, నరేష్, గడాల రఘు, మహిళా సంఘ అధ్యక్షురాలు లక్ష్మి, వీవోఏ శిరీష, శేఖర్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సయ్య, వైస్ ఛైర్మన్ బుచ్చెన్న సొసైటీ ఛైర్మన్ దేవేందర్ శుక్రవారం ప్రారంభించారు. చిన్నారెడ్డి, శ్రీను, అనిల్, రవీందర్ పాల్గొన్నారు.